# కుక్కుటచోరులు

పూసపాటి కృష్ణంరాజు

పైడమ్మ గుడిశముందు తల్లికోడిపెట్ట
కొ-క్కొ-క్కో; కొ-క్కొ-క్కో:
అని గోలచేస్తూంది. పైడమ్మ ఎవర్నో తిట్లతో ఎత్తిపోస్తున్నది. ఆ తిట్లతోనే తెల్లవారింది. శ్రీ రాజావత్సవాయివారి ప్రహరీగోడ చివరను పచ్చగన్నేరు పొదల్లో సూర్యుడు నవ్వుతూ కిరణాలు విరజిమ్ముకుని పకిలిగా ఉదయిస్తున్నాడు.

పైడమ్మ కూతురు నూకా లేడుస్తూంది. ఏడుస్తూ గడపలో కొళ్ళారజాపు కూర్చుంది. దానిముఖంలో ఏడుపు వీధి చివార పెదరాజుగారి సావిడీఅరుగుమీద కూర్చున్న నలుగురికీ తృప్తినిస్తున్నది.

పల్లెజనంఅంతా పనుల్లో నిమగ్నమౌతున్నారు. గొల్లభామలు పలకమీద పోసిన ఆవాల్లా దొర్లిపోతూ నీలాటి రేవుకి సాగిపోతున్నారు.

పైడమ్మ వీధిలో నిలుచుంది. కాదు ధర్మపథంలో నిలుచుంది. నిలుచుని నోరుపారేసుకుంది. పిచ్చెక్కినట్టు శాపనార్థాలు పెడుతూంది.

ఆ దారిని పోతూ, ఆగొడవ ఎవరికి పట్టినా ఎంతసేపని? ఒక్కక్షణం నిలుచుని "అయ్యొయ్యో పాపం! ఆళ్ళసేతులు మట్టిగలా, ఆళ్ళకేం రోగం వొచ్చిందమ్మా. యింతసేటన్నాయవా! యిదేం సిత్రమమ్మా!" అని నాలుగు సానుభూతివాక్యాలు సెప్పి ఎవరిపనుల్లో వాళ్లు వెళ్లిపోతున్నారు.

పైడమ్మ తిట్లూ, దీవెనలూ అందరికీ అలవాటేగాని, పైడమ్మ కూతు రేడుస్తూంది. నూకాలు ఏడవడం వీధిలో అందరికీ వింతగానేవుంది. అసలు నూకాలెప్పుడూ యీమధ్య ఏడవలేదు. కిలకిలా నవ్వుకుంటూ, కబుర్లుచెబుతూ అందర్నీ నవ్వించి తను నవ్వుతూ చలాకీగా నిశ్చింతగా అమాయకంగా రోజులు గడుపుకొస్తూంది.

నూకాలు పద్దెనిమిదేళ్ళ నిండు యౌవనంతో మిసమిసలాడుతూంది. ఎవరయినా మాటంటే అట్టే విరుచుకుపడేది. ఒల్లమాలిన సిగ్గుతో బుగ్గలురెండూ గంట్లుపడి లోతుకి నొక్కుకుపోయేవి. మాతిబిగించి ఎంతవాడినైనా "చాలెల్రా పచ్చినోడా" అని మాట విసిరేసి వొయ్యారంగా టర్కీకోడిలా నడుచుకుంటూ వెళ్లిపోయేది.

గంటెన్నులూ, చదపురుగులూ తెచ్చి కోడిపిల్లలను మేపేది. గరువు మీద గరికిపరక లేరి తెచ్చి గొర్రెపిల్లలను ఆదుకునేది. రావి ఆకులు కోసుకొచ్చి ఒక్కొక్క రెమ్మనీ మడతలుచుట్టి అందించి మేకపిల్లను దువ్వుకుంటూ మురిసిపోయేది. అప్పుడప్పుడు శ్రావ్యంగా కంఠం ఎత్తి గైరమ్మ పదం, చందమామపాట, పాడుకునేది. గొల్లవీధి భామలంతా చుట్టూ చేరి "నూకాలూ, నూకాలూ, పదం సదువ్వే" అని అడిగేవారు. ఓ ఘడియ మురిపించుకుని మురిపించుకొని పుచ్చపువ్వులా పూసిన వెన్నెట్లో కూర్చుని కంఠం విప్పేది. పదం అందుకుంటే ఎదురుగా వున్న రాజుగారి ప్రహరీగోడ ప్రతిధ్వనించేది.

"నూకాలి మొఖంలో మచ్చలేదు అందుకనే చందమామనీ నూకాలుముఖాన్నీ గుర్తించగలుగుతున్నాం" అని విశ్వన్న భావయుక్తంగా అనేవాడు. బిల్హణీయం చదువుకున్నాడో; శివశంకర శాస్త్రిగారి మహోదయం చదివేడోగాని అతని సామీప్యం రమ్యంగా వుందనడానికి నూకాలే నిదర్శనం.

"సౌందర్యం అనేది యిక మిగలకుండా అంతా విధాత నూకాలు అనే యౌవనవతిలో కుదించేశు" అని సన్యాసి విశ్వన్నకి వంత పాడేవాడు. అదీ నిజమే. అంత అందం వుండనే వుంది.

అయినా నూకాలిప్పుడేడుస్తున్నది.

పెళ్ళి కూడా కాలేదు. నలుగురైదుగురు చూపులకొస్తే ఏవేవో వంకలు చెప్పి "ఆడి జిమ్మడ; ఆడి కింద నాను మనువుతానా!" అని తిరస్కరించింది. పైడమ్మ కూతురంతంటే అంతే. కాదని ఎప్పుడూ అనలేకపోయేది.

"ఎప్పుడో దానికి నచ్చినోడొచ్చినప్పుడే ముడెడతాను" అనేది. పైడమ్మకూ, నూకాలుకూ ఏం తక్కువని. పైడమ్మ మెడలో మెరసిపోయే నానూ, తీగె, నూకాలి కంఠాన క్రొత్తందాన్ని పుణికిపుచ్చుకున్నాయి. రత్తయ్యను పిలచి యీ మధ్యనే చెవులకు నాగుజోడు చెయ్యించింది. మాటట్టుకుని వచ్చిన కానాపతిదగ్గిర బొద్దంచుకోకలు నాలుగన్ని — గొర్రెపిల్లనమ్మి కొనిపెట్టింది. నూకా లెప్పుడూ పువ్వుల్లాంటి కోకలు కట్టుకుని తిరిగేది.

పైడమ్మ కూలీ చెయ్యని రోజంటూలేనే లేదు. తల్లీ కూతుళ్లిద్దరూ పొలంలో పాటున్నప్పుడు; పొలాల్లో వ్యవసాయం పనీ, పొలంపాటు లేనప్పుడు; ధాన్యాల దంపుళ్లూ, ఊరగాయ సామాన్ల దంపులకనీ, ఇళ్ళకు కావాకులనీ, ఎల్లలు వెయ్యడంఅనీ, ఒక పనేమిటి తల్లీ కూతుళ్ళిద్దరకూ రాని పనేలేదు.

ఇరుగమ్మకూ పొరుగమ్మకూ పైడమ్మలాంటి పనికత్తెను చూస్తే అసూయగా వుండేది. కాని పైడమ్మను చూస్తే అందరికీ


శ్రవణానందకరమగు శబ్దగ్రహణమునకు
ఝంకార్ రేడియో
(బిర్లావారి యాజమాన్యమున తయారైనవి)



CONSORT
సరసమైన ధరలో లౌడ్ స్పీకర్,
పికప్ సౌకర్యములు గలది.
5 వాల్వులు, 3 బ్యాండులు అందమైన
వాల్ నట్ కాబినెట్టు.
A.C., A.C./D.G., డ్రైబ్యాటరీలలో
దొరుకును. ధర రు. 275/-
ఆంధ్రకు సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
టెరిటోరియల్ ఏజెన్సీస్,
పి. బి. నెం. 373, విజయవాడ - 2.
ప్రాతినిధ్యము లేనిచోట్ల ప్రతినిధులు కావలెను

# ★ కుక్కుటచోరులు ★

చూడలే పైడమ్మను కాదని నిలబడితే ఒక్క రోజయినా బ్రతగలరా! కూలి దొరుకుతుందా? పైడమ్మ ఆ వీధి కూలీలకు మేస్త్రీ.

మేస్త్రీ కూతకేడుస్తుంది, మేస్త్రీ దీర్ఘాలు తీసి తిడుతుంది. "నా గొంతు కోసే పోనారా! నా ఇంటికి నిప్పెట్టే పోనారా! నాను బుగ్గయిపోతే నూద్దామనుందట్రా; మీ జిమ్మడి రోగాలు గొట్టుకపోనూ, నీ మాడ్డిరప్పన్న మిమ్మల్నొట్టుకుపోనూ! మీ సేతులు బుగ్గిలోగలా, వన్నెడిపిస్తారా! వన్నెడిపించి మీరెం వొట్టుకుపోతార్రా! గండల్లారా!" అని దీర్ఘాలు తీస్తుంది. పైడమ్మ తిట్లస్థాయి హెచ్చింది.

పెదరాజుగారి సావిడి అరుగు దిగి విశ్శన్న, అప్పన్న, సన్యాశి, చిట్టిబాబు చల్లగా జారుకున్నారు. చెరువుగట్టువైపు వెళిపోయేరు. చెరువుగట్టు దిగి తుమ్మచెట్లలో లీనం అయిపోయేరు. వాళ్ళపనే అది! పైడమ్మ ప్రాణంతో సమానంగా పెంచుకుంటున్న కన్నెకోడిపెట్టను వాళ్లు నలుగురూ పొట్టను పెట్టుకుంటారా!

పైడమ్మ గుడిశనిండా మేకపిల్లలూ, కోళ్లూ, గొఱ్ఱెలూ కొదువలేదు. అక్కడే గడపముందు అరుస్తున్న కగరుపెట్టంటే పైడికి ఎక్కడలేని ముక్కవాను. రోజూ ఉదయాన్నే మేదరజాపూ ఎత్తగానే గూట్లోనుండి పైకొచ్చి రెండు రెక్కలూ టపటప లాడించి పరుగు పరుగున వెళ్ళి వత్సవాయి వారి ప్రహరీగోడమీదకు ఒక్క ఎగురు ఎగిరి క్రిందకు దూకేది.

ఆ దొడ్లో తిరిగి అక్కడ దివాణం డింకీ పుంజుకి పరువై మూడు పుంజీల గుడ్లు పెట్టింది. అన్నిటినీ అదే పొదిగి పిల్లల్ని చేసింది. కాకికీ గ్రద్దకూ పోనుపోను ఒక్క పెట్టపిల్లమాత్రం మిగిలింది. పుంజు వరిగైతే మంచి పొడుగాటి సోగలతో రంగు రంగుల ఈకలతో చూడ ముచ్చటగా వుండవలసింది. యీ పెట్టపిల్లమాత్రం ఎంత యింపుగా వుండేదనీ. దానికీ చిన్నసోగలొచ్చి చక్కని ఏన్నూ, ముక్కుతీరూ వుండి, నిగనిగలాడిపోయేది.

పైడమ్మ పొద్దేళగట్ల చేలోనుండి వస్తూ గంపెన్నులు తురుముకొచ్చేది. గడపలో మేదరజాపూలో కంకి నలుపుతూ దులిపేది. దీపంబుడ్డీ తెచ్చి దగ్గర పెడితే, తల్లిపెట్ట ఆ గ్రుడ్డివెల్తుర్లో లుక్కు, లుక్కు-లుక్కు-లుక్కు మని పిల్లను పిలిచేది. క్నీ-క్నీ-క్నీ-క్నీ మని పిల్ల తల్లికాళ్ళక్రింద దూరేది. అప్పుడప్పుడో గింజ పొడవడానికి ప్రయత్నించేది. తల్లిమాత్రం ముక్కుతో టక్-టక్-మని గింజల్ని పొడుచుకుతినేది.

"మేత పిల్లకెట్టక పోతు నాగ నువ్వె మెక్కడాని కలే వొట్టుకొచ్చినాను!" అని దీపం తీసి ద్వారబంధాన్ని అమర్చిన చెక్కమీద పెట్టి నిశ్చింతగా కూతురు నూకాల్ని చూస్తూ మురిసిపోతూ నిద్రపోయేది.

ఆ పిల్లపెట్ట చక్కగా పెరిగి పెద్దదయింది. ఇంకా గుడ్లు పెట్టడానికి రాలేదుగాని గుండులా వుండేది. కన్నెపెట్ట సోగల డింకీ పుంజుకి పుట్టింది. నడకలోనూ తీరులోనూ పుంజులానే. ఎప్పుడూ తల్లిపెట్ట వంటిపెట్టుకుని తిరిగేది. ఆ కన్నెకోడిపెట్ట రాత్రి గూటికి రాలేదు. ఏమయిపోయింది! పైడమ్మ దానికోసం ఊరంతా వాడంతా గాలించింది. ఎక్కడా కనుపించలేదు. హఠాత్తుగా మాయం అయిపోయింది. అందుకే తల్లిపెట్ట అరుస్తూంది పైడమ్మ తిడుతూనే వుంది. తిట్టదూ మరి? తిట్టకా, ఏడుచుకోకా ఏంచేస్తుంది; ఆడముండ!

నిన్న అసురసంధ్యవేళ సావిడి అరుగుమీద విశ్శన్న, అప్పన్న, చిట్టిబాబు, సన్యాశి, నలుగురూ కలసి ప్లాను వేసుకున్నారు. గుసగుసలాడుకున్నారు. అప్పన్న దగ్గర గేలాపు రువ్వలున్నాయి గబగబా వెళ్లి తెచ్చేడు. విశ్శన్న స్వయంగా గేలాపురవ్వకు ఎండు పరిగను తెచ్చి తాడును వ్రేళ్లాడుతున్న ముల్లుకు గుచ్చేడు. ప్రహరీగోడప్రక్కను ఎరవేసేడు వరిగపెట్ట గేలాపుముల్లుతో సహా పరిగను మ్రింగింది. మింగి గిలగిలా తన్నుకుంది. రెక్కలు కొట్టుకుంది. తక్కిన కోళ్ళన్నీ బెదరి గంతులేసేయి.

విశ్శన్న చిటికలో గోడగెంతి వరిగపెట్టను పట్టుకున్నాడు. తూరీగలా పరువెత్తి దూరంగావున్న అంటుమావిడితోటలో సువర్ణరేఖ చెట్టు పలవల్లో ఎవ్వరూ చూడకుండా కట్టిపెట్టేడు.

ఎక్కడ దాచిందీ, తను ఎంత ఘనకార్యం చేసిందీ చెప్పి మిత్రుల్ని మెప్పించేడు.

విశ్శన్న, సన్యాశీ, అప్పన్న, చిట్టిబాబూ కలసి వెన్నెల ముదరగానే తోట చేరుకున్నారు. అప్పుడప్పుడు చిన్న చిన్న మబ్బుతునకలు ఆకాశంలో చంద్రబింబాని కడ్డొస్తున్నా వెన్నెల బాగానేవుంది. దూరంగా గుంటనక్కల అరుపులు తప్ప ఆ రాత్రి అంత బీభత్సంగా లేదు.

కావాల్సిన సామాగ్రి యావత్తూ ఇళ్ళ దగ్గరనుండి రహస్యంగా ఎవరికీ తెలియకుండా తలా ఒకటి, దొంగతనంగా అక్కడకు చేరవేసేరు. పది గంటలరాత్రి అవనే లేదు. అయినా అంతటా నిర్మానుష్యంగా వుంది.

కన్నెపెట్టను విశ్శన్న విప్పుకొచ్చేడు. నలుగురి చేతుల్లోనూ ఆ కోడిపెట్ట నలిగిపోయింది. కన్నెపెట్ట రూపు కోల్పోయింది. గుండులా తయారయింది గుడ్లు పెట్టవలసినపెట్ట, వరిగపెట్ట, ముచ్చటగా తల్లిచాటున పెరుగుతున్న సోగల కోడిపెట్ట.

నలుగురూ గ్రుడ్డివెన్నెట్లో గుసగుస లాడుకున్నారు ఏకీలు కాకీలు వూడదీసేరు. తెచ్చిన మసాలా సామాను పట్టించేరు. రాళ్ళేరి తెచ్చి పొయ్యిపెట్టేరు. వెన్నెట్లో తళతళా మెరసిపోయే యిత్తడిపాత్రను పొయ్యెక్కించేరు. అగ్గిపెట్టెంటు వూది గోరిడంత అగ్గిని బహ్మాండంగా రాజేసేరు. ఏరి తెచ్చిన ఎండు చితుకులతో పొయ్యి మంటపెట్టేరు. పొయ్యిలో పుల్లలు అంటుకుని సన్నని కొనల్ని విరజిమ్మేయి. విరజిమ్మి కొనల్ని బాగా సాచుకున్నాయి. ఆ వెలుగులో వాళ్ళ నలుగురి ముఖాలూ ప్రకాశవంతంగానే వున్నాయి.

పొయ్యిమీద పాత్ర కుతకుతా వుడుకు పట్టింది. పైడమ్మ ఆప్యాయంగా పెంచిన బంగారంలాంటి వరిగపెట్ట ఆ నలుగురి నోళ్ళలోనూ పడిపోయింది. పిప్పి పిప్పి క్రింద నమిలి మ్రింగేరు.

"కారం లావయింది్రోయ్" అని ముసూచికం గంట్లముఖంతో అప్పన్న వొగర్చేడు. నలుగురూ తృప్తిగా చెరువుకి పోయి కాలే కడుపుని నీళ్ళతో నింపుకున్నారు.

పైడమ్మ తిటదూ! నూకా లేడవదూ! ఆ కన్నెకోడి నెంతో దోస్తీగా పెంచింది. తన ప్రాణంతో సరిగా చూసుకుంది.

నూకాలు దాः! దాः! దాः! అని పిలుస్తే రెక్కలు టప; టపా మని కొట్టుకుని ఎగిరి గంతేసి వచ్చి తన బుజాలమీద కూర్చునేది. నూకాలదే ఏడవడం. అంతకు ముందెప్పుడూ నవ్వేగాని ఏడ్చి ఎరుగదు. నూకాల్ని చూస్తే ఏడుపుకునే "దొంగలు" నలుగురూ చెరువుగర్భంలోవున్న తుమ్మచెట్ల మరుగున ఇవ్వాళ ముసి ముసినవ్వులు నవ్వుకుంటున్నారు. ఆ నవ్వులో యీ రహస్యం దాగుతుందా? అన్న బితుకు మాత్రం ధ్వనిస్తోంది.

పైడమ్మ తిడుతూనేవుంది.

నూకా లేడుస్తూంది. ★


